


## అడల్ట్స్ ఓన్లీ!

# ఆమె... అతడు... ఆమె!

– నూరేపల్లి విజయ

భావుకత్వం చిత్రంగా, ఓ అద్భుత చిత్రంగా ప్రాణం పోసుకుంటోంది. ఆ కొండల మధ్య నేలమీద పరుచుకున్న పచ్చగడ్డి సాక్షిగా, ఆ సాయంవేళ సాయం సంధ్యను చూస్తూ చేతిలోని కుంచెను అలవోకగా కాన్వాసు మీద కదిలిస్తున్నాడు వీణను శృతి చేసినట్లు సిద్ధార్ధ.

చిత్రకారుడెప్పుడూ మంచి భావుకుడే. అతని ఊహల్లో ఓ అనుభూతి ఓ చిత్రంగా రూపుదిద్దుకుంటోంది. ఆరుబయట వెన్నెట్లో పచ్చగడ్డి మీద ఓ అమ్మాయి ప్రకృతిని నేనే సుమా అన్నట్లు అనాచ్ఛాదితంగా...

ఆ నగ్న సౌందర్యాన్ని చూసిన వెన్నెల ఓ సన్నటి తెరగా మారి ఆమె శరీరాన్ని చుట్టుకుంది. ఆమె కావ్య నాయికలా వుంది. ప్రియుడికోసం ఎదురు చూసే అభిసారికలా వుంది. శరీరాన్ని లయబద్ధంగా కదిలిస్తూ తన యవ్వన వీణను శృతి చేసే వ్యక్తి కోసం నిరీక్షిస్తున్నట్లుంది.

ఆ బొమ్మ వంక అలాగే చూస్తుండిపోయాడు సిద్ధార్ధ. ఇది తన చేతిలో రూపుదిద్దుకున్న బొమ్మ. తన ఊహల్లో ఊపిరి పోసుకున్న బొమ్మ. మరి తన మనసులో చోటు చేసుకున్న బొమ్మ ఏది? అప్పుడు గుర్తొచ్చింది. అప్రయత్నంగా అతని చేయి గుండెలపైకి వెళ్లింది.

'సిద్దూ' ముగ్ధ మనోహరంగా గుండెపొరల్లో నుంచి పిలుపు వినిపించింది. ఆ పిలుపు అతని మనసు తీరాన్ని తాకింది. అది ప్రత్యూష పిలుపు. తొలి ప్రత్యూషపు మేలుకొలుపు. తన ప్రాణం. తన నెచ్చెలి. చలిలో తనకు వెచ్చని కౌగిలి... ప్రత్యూష. వాటే స్వీట్ మెమరీ!

ఎంత సౌందర్యం? ఎంత ముగ్ధ మనోహరం?

మొట్టమొదటిసారిగా ఓ స్త్రీని నగ్నంగా చూశాడు. వెన్నెలను పిండిగా చేసి భావుకత్వాన్ని ఆకారంగా మరిచి సృష్టిలోని అందాలను అక్కడక్కడ అందంగా అదిమినట్టు ప్రత్యూష ... తన ప్రత్యూష!

రాత్రి జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది.

నాలుగిళ్ల ప్రత్యూష సహచర్యం... రాత్రే తన బ్రహ్మచర్యానికి, ఆమె కన్నెతనానికి అనుకోకుండా విముక్తి ప్రసాదించిన వెన్నెల రాత్రి. అది పొరపాటో, యాదృచ్ఛికమో! పేరు ఏదైతేనేం నిన్నటి రాత్రి వెన్నెల కురిసిన రాత్రి.

★★★

తలుపుల మీద ఎవరో దబదబ బాదిన శబ్దం.

బొమ్మ వేయడానికి కాన్వాసును సిద్ధం చేస్తున్న సిద్దార్థ ఆ శబ్దానికి ఉలిక్కిపడి టైం చూసుకున్నాడు. రాత్రి పది దాటింది. అందులోనూ చలికాలం. సిటీకి నాలుగు కిలోమీటర్ల దూరంలో వున్న తనింటికి...

మళ్లీ అదే శబ్దం.

లుంగీని సరి చేసుకుని వెళ్లి తలుపు తీశాడు. ఎదురుగా ప్రత్యూష. ఆశ్చర్యం, ఆనందం, అబ్బురం... అన్నీ కలగలసిన ఫీలింగ్.

"ప్రత్యూష! నువ్వా... ఇంత రాత్రివేళ?"

ఆమె చలికి వణుకుతోంది. కొంగును నిండుగా కప్పుకుంది.

"కాలనీలో ఎవరో రౌడీషీటర్ ఒకతన్ని పొడిచి చంపాడు. కాలనీ అంతా గందరగోళంగా వుంది. పోలీసులు వచ్చారు. వన్ ఫార్టీఫోర్ సెక్షన్ విధించారు. అమ్మా నాన్నా పెళ్లికి వైజాగ్ వెళ్లారు. భయమేసి నీ దగ్గరికి వచ్చాను" గబగబా స్కూల్లో మాస్టారి ముందు పాఠం అప్పగించినట్లుగా చెబుతోంది. చలికి ఆమె పెదవులు వణుకుతున్నాయి.

ప్రత్యూషతో అతని పరిచయం వయసు నాలుగేళ్లు. ఆ పరిచయం ప్రేమగా మారి



మూడేళ్లు కావస్తోంది. ఆ ప్రేమ విడదీయలేని అనుబంధంగా మారింది. ఈ నాలుగేళ్లలో సిద్దార్థ ఇంటికి రావడం ఏ నాలుగోసారో అయిదోసారో. అంతే!

డిగ్రీ అవగానే పెళ్లి చేసుకుందామంది ప్రత్యూష. డిగ్రీ అయిపోయి సంవత్సరం కావస్తున్నా ఇంట్లో చెప్పే ధైర్యం చేయలేదు. సగటు ఆడపిల్ల.

''థాంక్స్ టు రౌడీషీటర్'' నవ్వుతూ అన్నాడు సిద్దార్థ.

''ఎందుకు?'' అయోమయంగా అడిగింది ప్రత్యూష.

''కనీసం ఇలాగైనా వచ్చావు''

''చాల్లెండి. నేనెంత హడలి చచ్చానో తెలుసా నీ దగ్గరికి రావడానికి. ఎంత రిస్క్ తీసుకున్నానో? నువ్వేమో మంచి వాతావరణం, ప్రశాంతత అంటూ సిటీకి దూరంగా ఇక్కడున్నావు. ఆటోవాళ్లు మీటరు మీద వందిచ్చినా రానన్నారు''

అతని దగ్గరికి రావడానికి తనెంత కష్టపడ్డదీ చెబుతోంది. ఆమె మాట్లాడుతున్నప్పుడు చెవులకున్న జూకాలు అందంగా అటూ ఇటూ గడియారంలోని లోలకంలా ఊగుతున్నాయి.

సిద్దార్థ ఫ్లాస్కులో నుంచి టీ కప్పులో పోసి ఆమెకు అందించాడు. తర్వాత ఆమెకు గది చూపించాడు. అర్ధరాత్రి వరకూ కబుర్లు చెప్పుకుని అలసి తమ తమ గదుల్లోకి వెళ్లిపోయారు.

★★★

రౌడీషీటర్ పెద్ద తల్వార్‌తో కనిపించినవాడినల్లా పొడిచేస్తున్నాడు. హాహాకారాలు, రక్తసిక్తాలు, అరుపులు, కేకలు. ఆ రౌడీషీటర్ ప్రత్యూష దగ్గరికి వచ్చాడు. ఆమెను ఒడిసి పట్టుకుని తల్వార్‌తో ఆమె పొట్టలో...

కెవ్వున అరిచి కళ్లు తెరిచింది ప్రత్యూష. భయంకరమైన కల. ఆమె మొహమంతా స్వేదం అలుముకుంది.

సిద్దార్థ పరుగెత్తుకు వచ్చాడు. అతన్ని గట్టిగా హత్తుకుంది. అతను ఆమెను ఓదార్చాడు.

చల్లగాలి కిటికీలో నుంచి రివ్వున వస్తూ వాళ్లిద్దరి మధ్యలోనుంచి దూరి బయటకు వెళ్లలేక సతమతమై నిస్సహాయంగా వెనక్కి తిరిగింది. ఆమెనలాగే పొదివి పట్టుకున్నాడు.

ఆమె అతన్ని తన చేతులతో పెనవేసింది. చిన్న ప్రకంపన సిద్దార్థలో. తొలి స్పర్శ... పాదం నుంచి ఆపాదమస్తకం వరకూ.

ఆమెను మంచంమీద పడుకోబెట్టాడు. భయంతో అతన్ని వదిలిపెట్టలేదు ప్రత్యూష. అతను తనని విడిచిపెడితే తనను ఆ రౌడీ కత్తితో పొడిచి చంపేస్తాడేమోనన్న భయం.

ఆమె భయం అతని పాలిట వరమయింది. ఇన్నాళ్ల మానసిక ప్రేమ శారీరక కలయికతో పునీతమైంది.

ఆమె... అతను.


చలి...వెన్నెల.

ప్రకృతి...పురుషుడు.

క్షణాల అనుభూతి పొత్తిళ్లలో కరిగి ఒదిగి పోతున్నాయి. అంత చలిలోనూ ఆమె నుదుట సిందూరాన్ని ముద్దాడుతూ స్వేదబిందువులు...ఏ ఆచ్ఛాదనలేని ఆమె శరీరం అందమైన ప్రకృతిలా, వెన్నెలతో చేసిన బొమ్మలా భావుకుడి శృంగార రసానుభూతికి సాక్ష్యంగా పదిలంగా అతని గుండెలో ముద్రించుకుపోయింది.

ఆ రాత్రే వాళ్ల తొలి సమాగం సాక్షిగా ...

మానసికంగా, శారీరకంగా భార్యాభర్తలయ్యారు. హిమం, సుమమై వాళ్లని ఆశీర్వదించింది. అక్కడ వర్షం హర్షమైంది.




మరో రెండురోజుల్లో ప్రత్యూష తల్లిదండ్రులు వస్తారు. వాళ్లతో మాట్లాడి ప్రత్యూషను శాశ్వతంగా తన దాన్ని చేసుకోవాలి. ఆ ఊహే అందంగా వుంది.

కానీ ఆ ఊహను ప్రశ్నిస్తూ ఓ సంఘటన తనని నిలదీస్తుందని ఊహించలేదు సిద్దార్థ.

ఆ సంఘటన మరుసటిరోజు జరిగింది.

★★★

ఇంట్లోకి అడుగుపెట్టిన సిద్దార్థ తండ్రిని, తల్లిని, మేనమామని, అత్తని, మరదలు భావనని చూస్తూ ఆశ్చర్యపోయాడు.

''అదేమిట్రా! అందమైన బొమ్మలు వేసే నువ్వు బొమ్మలా నిలబడిపోయావు'' మేనమామ అల్లుడిమీద చతురోక్తి విసిరాడు.

''అదేంలేదు మామయ్యా. పిడుగులేని వానలా...'' నవ్వుతూ అన్నాడు.

కుశల ప్రశ్నలు, రొటీన్ పలకరింపులు అయ్యాయి. భావన బావవైపు చూడ్డం అందరూ గమనించారు. విషయాన్ని కదపడమే మంచిదనుకున్నాడు సిద్దార్థ తండ్రి నారాయణరావు.

''సిద్దూ! భావనని నీకిచ్చి చేయాలని మీ మామయ్య నిశ్చయించుకున్నాడు. వచ్చే వేసవిలోనే పెళ్లి చేయాలని. నీకా చదువు అయిపోయింది. అదీకాక చిన్ననాడే అనుకున్న సంబంధం'' తండ్రి చెప్పుకుపోతున్నాడు.

సిద్దార్థ మెదడు మొద్దుబారింది.

మేనమామ అందుకున్నాడు.

''అయినా చిన్నప్పుడే మీ పెళ్లి జరిగింది. అది వేరే విషయం. పెద్దయ్యాక మళ్లీ పెళ్లి. ఒకేసారి ఒకే అమ్మాయిని రెండుసార్లు పెళ్లి చేసుకుంటున్నావు. షష్టిపూర్తిరోజు మరోసారి'' నవ్వుతూ అంటున్నాడు.

చిన్నప్పటి భావనతో పెళ్లి లీలగా గుర్తొచ్చింది. అమ్మ తీవ్రమైన అనారోగ్యంతో వున్నప్పుడు అన్నకూతురితో తన పెళ్లి చూడాలని పట్టుబడితే అయిదారేళ్లు కూడా నిండని తనకు నాలుగేళ్ల భావనకు పెళ్లి. ఓ పసుపుకొమ్ముకు దారం చుట్టి. అది తను మరచిపోయాడు. వాళ్లు కూడా మరచిపోయాడనుకున్నాడు. ఇన్నేళ్లు...ఇన్నేళ్లు ఎప్పుడూ తన మరదలు భావనని కలుసుకోలేదు. భావన కూడా తనని కలవలేదు. మరచిపోయిందనుకున్న సంఘటన ఇలా పునరావృతమై తన ఆశలను, తన ప్రత్యూషను ఇబ్బందుల సుడిగుండంలోకి నెడుతూ...

''అల్లుడు ఊహల్లోకి వెళ్లినట్టున్నాడు'' మేనమామ జోకేస్తూ బయటకు వెళ్లాడు.

★★★

సిద్దార్థ మెదడు ఆలోచనలతో వేడెక్కింది. అనుకోకుండా జరిగిన ఈ సంఘటన పర్యవసానం ఏమిటి? నిజం తండ్రికి చెబితే, మేనమామకు చెబితే...ఊహూ ముందు చెప్పాల్సింది భావనకు. తను భావనకు మాత్రమే జవాబుదారి. రాత్రి మేనమామ తన గదిలోకి వచ్చి అన్న మాటలు విన్నాక అది రూఢీ అయింది.

''సిద్దూ! ఇన్నాళ్లు భావన నిన్ను కలవలేదని, నీకు ఉత్తరాలు రాయలేదని, నిన్ను మరచిపోయిందని అనుకుంటున్నావు. కానీ అది కాదు. అది ప్రతిక్షణం నిన్నే తలచుకుంటుంది. నీ చదువు, చిత్రకారుడిగా నీ ఏకాగ్రత ఇవేమీ దెబ్బ తినకూడదని తన ప్రేమను తన గుండెల్లోనే దాచుకుంది. పిచ్చిది నీతో బంగారు మంగళసూత్రాలు కట్టించుకోదట. చిన్నప్పుడు నువ్వు తన మెడలో కట్టిన పసుపుకొమ్మునే కట్టించుకుంటుందట'' కళ్లజోడు తీసి కళ్లు తుడుచుకుంటూ చెప్పాడు మేనమామ.

అలాంటి భావనకు తను సంజాయిషీ చెప్పాలి. అది తన బాధ్యత.

★★★

''భావనా... అదీ జరిగింది. చిన్ననాటి మన పెళ్లిని నేను ఎప్పుడో మరచిపోయాను.

నీలో నేను ఇంతలా గూడు కట్టుకున్నానన్న విషయం నాకు తెలియదు. బాల్యంలో జరిగిన ఆ పెళ్లి కాలచక్రంలో మరుగున పడుతుందనుకున్నాను. ప్రత్యూషను మనస్ఫూర్తిగా ప్రేమించాను. అనుకోని పరిస్థితిలో ఒక్కటయ్యాం. ఒకవేళ అలా జరక్కుండా వుండి వుంటే ఆమెను నా కన్నీళ్లతో క్షమాపణ కోరుకుని నా చిన్ననాటి వూహల్ని, ఇన్నాళ్ల ఆశలను నిజం చేసి నీకు తాళి కట్టేవాడిని. నేనిప్పుడు ముద్దాయిని. తీర్పు నువ్వే చెప్పు భావన''.

ఇంట్లో అందరూ నిద్రపోయారు. ఒంటరిగా గదిలో వున్న భావనకు ప్రత్యూష గురించి తమ ప్రేమ గురించి, తమ మధ్య జరిగిన ఆ రాత్రి సంఘటన గురించి చెప్పి పరిష్కారం అడిగాడు.

భావన మాట్లాడలేదు. ఆమె కనుకొలకుల నుంచి రాలిపడిన కన్నీటి చుక్కే మాట్లాడింది. ఆ మాటలకు శబ్దం లేదు. లిపీలేదు. కన్నీళ్లు తుడుచుకుంటూ ఒకే ఒక మాట అంది.

''చాలా రాత్రయింది. నువ్వెళ్లి పడుకో బావ''

★★★

కోడికూత, ''బావ'' అన్న భావన పిలుపు రెండూ ఒకేసారి వినిపించాయి. కళ్లు తెరిచాడు. ఎదురుగా భావన. రాత్రంతా నిద్ర లేనట్టు కళ్లు ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. ఆమె పిడికిలి మూసి ఉంది.

ఇంకా పూర్తిగా తెల్లవారనేలేదు.

''అలా బయటకెళ్దాం రా బావా'' అంది.

అతను మంత్రముగ్ధుడిలా అనుసరించాడు.

చుట్టూ కొండలు, పచ్చగడ్డి, మంచు కురుస్తూనే ఉంది.

''బావా! పెళ్లంటే శరీరాల కలయిక, మనసులో మనసై శరీరంతో మమేకమై జీవితాంతం ఒకరి గుండెల్లో మరొకరు గూడు కట్టుకునే అద్భుత సంఘటన. చిన్నప్పటి మన పెళ్లి ఆలోచనలకు అందనిది. నిజంగా బొమ్మలాటే. కాలంతోపాటు ఆశలూ పెంచుకున్నాను. అది నా తప్పే. నీ మనసేమిటో పెరిగే వయసు, పెరిగే ఆలోచనలు, ఆశలు తెలుసుకోలేకపోయాను.

మానసికంగా ప్రేమించుకుని ఒకటైన మీరు శారీరకంగా కూడా కలిసి దాంపత్యానికి పరిపూర్ణమైన నిర్వచనమయ్యారు.

ప్రపంచంలో అన్నాచెల్లెళ్ల ప్రేమ, తండ్రీకూతుళ్ల ప్రేమ ఇలా రకరకాల అనుబంధాలతో ప్రేమలు పెనవేసుకుపోయాయి. కానీ ఒక్క భార్యాభర్తల ప్రేమే శారీరకంగా రెండు శరీరాలు మమేకమవుతాయి. అందుకే ఆ బంధం గొప్పది. చివరివరకూ నిలిచేది భార్యాభర్తల బంధమే. మీరిద్దరూ మనసా వాచా కర్మణా ఏకమయ్యారు. నువ్వు ప్రత్యూషను పెళ్లి చేసుకోవడమే న్యాయం, ధర్మం. కానీ నాదొక చిన్న కోరిక బావా'' ఆగి వణుకుతున్న కంఠంతో ''ప్రత్యూష మెడలో నువ్వు కట్టాల్సిన మంగళసూత్రం ఇదే''

ఆమె పిడికిలి తెరిచింది. అందులో మంగళసూత్రం. ఊహూ... పసుపుకొమ్ము. చిన్నప్పుడు తను భావన మెడలో కట్టిన పసుపుకొమ్ము.

''ఈ పసుపుకొమ్ము పవిత్రతకు చిహ్నం. తెలిసీ తెలియని వయసులో నువ్వు కట్టిన ఈ పసుపుకొమ్ముకు అప్పుడు విలువలేదు. కానీ ఇప్పుడు ఈ తాళితోనే మీరు భార్యాభర్తలు కావాలి. దానికి నిజమైన గుర్తింపు, విలువ ఇప్పుడే వుంది. ఈ పవిత్రమైన తాళి ప్రత్యూషది. నాన్నకు, మామయ్యకు నేను సర్దిచెబుతా'' అంటూ పసుపుకొమ్ము సిద్ధార్థ చేతిలో పెట్టి ముందుకు కదిలింది.

భావన నడుస్తుంటే ఓ త్యాగం కదులుతున్నట్లుగా ఓ ఆర్ద్రత ఆకారమై వెళుతున్నట్లుగా నీహారికా బిందువులు పుష్పాలై ఆమెను అభిషేకిస్తున్నాయి. మెల్లమెల్లగా కనుమరుగవుతున్న భావనను చెమ్మగిల్లిన కళ్లతో అలాగే చూస్తూ నిలబడిపోయాడు సిద్ధార్థ.

★

